క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత పది రోజుల నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యేకంగా కార్మికులను ఏర్పాటుచేసి పట్టణంలో చెత్త సేకరించే విధంగా చర్యలు చేపట్టారు. మున్సిపల్ కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించడంతో గురువారం సమ్మె విరమించి విధుల్లో చేరారు. పట్టణంలోని అన్ని వీధుల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు విద్యార్థుల కాలినడక

పెదకాకాని: స్వామీ వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకుని వీవీఐటీ ఆధ్వర్యంలో దర్గా టు దుర్గ కాలి నడక నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటలకు గుంటూరు మస్తాన్ దర్గ వద్ద నుంచి నడక ప్రారంభమవుతుందన్నారు. 13 సంవత్సరాలుగా సుమారు 1500 మంది విద్యార్థులతో 33 కిలోమీటర్లు మేర ఈ కాలినడక కొనసాగుతుందని చైర్మన్ విద్యాసాగర్ తెలియజేశారు.

టీబీ రోగులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రత్తిపాడు: టీబీ రోగులు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రత్తిపాడు టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుచిత అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ గ్రామంలోని క్షయ వ్యాధిగ్రస్తులను నిక్షయ్ మిత్రగా దత్తత తీసుకున్నారు. పౌష్టికాహారం నిమిత్తం వారికి ఆరు నెలలకు కావలసిన నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ కె. రాంబాబు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో అదే గ్రామానికి చెందిన తిప్పాబత్తిన రాజ్‌కుమార్ గుట్టుచప్పుడు కాకుండా తన ఇంట్లోనే అక్రమంగా మద్యం దాచి విక్రయిస్తున్నాడన్న సమాచారం సెబ్ ఎస్ఐ గీతకు అందింది. దీంతో ఆమె తన సిబ్బందితో కలిసి రాజ్‌కుమార్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేశారు. మూటగట్టి ఉన్న తెల్లగోతంలో 20 విస్కీ బాటిల్స్ ఉండటాన్ని గుర్తించి బాటిల్స్‌ను సీజ్ చేశారు. ఈ మేరకు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

పెదకాకాని: డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళాపరిషత్ 13వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు లలిత కళానికేతన్ వ్యవస్థాపకుడు మోపర్తి కాళిదాసు తెలిపారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మోపర్తి కాళిదాసు మాట్లాడుతూ డాక్టర్ కాసరనేని సదాశివరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ప్రతి రోజూ మూడు నాటికలు ప్రదర్శింపబడతాయన్నారు. నిత్యం సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించడంతో పాటు నేటి సమాజానికి మంచిని పంచాలనే ఆశయంతో ఈ నాటికల ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కళలను ఆదరించి కళాకారులను పోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో సభ్యులు మోపర్తి నాగేశ్వరరావు, మోపర్తి సదాశివరావు, మోపర్తి పరమేశ్వరరావు, నందిపాటి ప్రసాద్, పాములపాటి శ్రీనివాసరావు, షేక్ గాలీబు, మోపర్తి రాంబాబు, యడ్లపల్లి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో నటరత్నాలు చిత్ర దర్శకుడు

ఏఎన్‌యూ: త్వరలో విడుదల కానున్న 'నటరత్నాలు' చిత్ర దర్శకుడు నర్రా శివ నాగేశ్వరరావు గురువారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీని సందర్శించారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ అందిస్తున్న కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ వినూత్నమైన ఆలోచనతో ఈ కోర్సులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. యల్లమాటి చంటి నిర్మాతగా ఫిబ్రవరిలో విడుదల కాబోతున్న క్రైమ్, కామెడీ చలన చిత్రం 'నట రత్నాలు' విశేషాలను శివనాగేశ్వరరావు పంచుకున్నారు. స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విశేషాలను విభాగ కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిత వివరించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఆటల పోటీలు

పొన్నూరు: యువతకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు పొన్నూరులో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్ ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో యువకులు పాల్గొనాలని సూచించారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ప్రతిరోజు 30కు పైగా బ్యాచ్ లకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ కే శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడింపాలెంలోని నరేంద్ర అకాడమీ, గొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండవ రోజు మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మండలంలోని పదమూడు గ్రామ సచివాలయాల నుంచి



టాస్‌వేసి పోటీలను ప్రారంభిస్తున్న పీడీలు దేవిడ్‌రాజ్ కుమార్, నందకిషోర్

పదమూడు టీంలు పోటీల్లో తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన పోటీల్లో ప్రత్తిపాడు-1 సచివాలయంపై తిక్కిరెడ్డిపాలెం సచివాలయం టీం విజయం సాధించి మండల స్థాయి వాలీబాల్ విజేతగా నిలిచారు. ఆయా పాఠశాలల పీడీలు నందకిషోర్, దేవిడ్‌రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతగా నిలిచిన తిక్కిరెడ్డిపాలెం జట్టు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

- డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు డాక్టర్ రేవతి
- సిబార్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు
- ముఖ్యఅతిథిగా హాజరైన డీసీఐ సభ్యురాలు డాక్టర్ పి రేవతి



డీసీఐ సభ్యురాలు డాక్టర్ రేవతికి జ్ఞాపిక అందజేస్తున్న కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ తదితరులు

పెదకాకాని : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించాలని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యురాలు డాక్టర్ పి రేవతి అన్నారు. పెదకాకాని మండలంలోని తక్కెలపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పి రేవతి మాట్లాడుతూ విద్యార్థులంతా సహృద్భావంతో, స్నేహంగా ఉంటూ విద్యనభ్యసించాలన్నారు. ర్యాగింగ్ వంటి భూతాలకు దూరంగా ఉండాలని సూచించారు. దంత వైద్య విద్యను అభ్యసించుటకై సిబార్ కళాశాలను ఎంచుకున్నందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ర్యాగింగ్ వంటి అనైతిక కార్యక్రమాలకు తావు లేకుండా, కష్టపడి చదివి కళాశాలకు, జన్మనిచ్చిన తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మిస్టర్ ఫ్రెషర్, మిస్ ఫ్రెషర్, లక్కీ ఫ్రెషర్ గా గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. సభలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నిష్ణాతులైన దంత వైద్యులుగా ఎదగడం కోసం సిబార్ దంత వైద్య కళాశాలను ఎంచుకున్నందుకు నూతన విద్యార్థులు అందరికీ అభినందనలు తెలిపారు.విద్యార్థులను నిష్ణాతులైన దంత వైద్యులుగా తీర్చిదిద్దమే కాకుండా, అన్ని రంగాల్లో ఉత్తములుగా తీర్చిదిద్దటమే తమ కళాశాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ బి వి రమణారెడ్డి, వైస్ డీన్ లు డాక్టర్ మన్నే ప్రకాష్, డాక్టర్ బొల్లా నగేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లయోలాలో సంక్రాంతి సంబరాలు



భోగి మంటలు వేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు రూరల్: సంక్రాంతి పండుగ మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే పండుగని లయోలా పాఠశాల ప్రిన్సిపల్ రెవరెండ్ పాథర్ సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు ఇటువంటి పండుగల ద్వారా తెలియజేయటం జరుగుతుందని ప్రతి ఒక్కరూ మన సంప్రదాయాలను తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, రంగవల్లులు, భోగిపళ్ళు, పరమాన్నం వితరణ, పులివేషాలు, ఎద్దుల బళ్ల ప్రదర్శన, పిండి వంటల ప్రదర్శన విద్యార్థినీ విద్యార్థుల సంప్రదాయ వస్త్ర ధారణతో ప్రాంగణం కోలాహలంగా మారింది. కార్యక్రమంలో సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పీ ఆంథోని, వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ నరేష్, రెవరెండ్ ఫాదర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాలకే ముప్పు

గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర్



ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలసుందర్

ప్రత్తిపాడు: అతివేగం ప్రాణాంతకమని గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాలలో గుంటూరు నెహ్రూ యువ కేంద్ర సహకారంతో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర్ హాజరయ్యారు. ట్రాఫిక్ రూల్స్, సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేసే విధానం, ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్‌బోర్డులు, టూవీలర్లు, ఫోర్ వీలర్లు నిలిపే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. థ్రిల్ కోసం విపరీతమైన వేగంతో వాహనాలను నడిపే సమయంలో, మీపై ఎన్నో కలలు పెట్టుకున్న కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్టు పెట్టుకోవడం తప్పనిసరన్నారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి జగనన్న పాలన నిలువుటద్దం

ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పరిచి ప్రజా సంక్షేమానికి నిత్యం కృషిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరం సైనికుల్లా ముందుకు సాగుదామని పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జేసీఎస్ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళిక దిశా నిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ వివరించారు. జగనన్న పాలనలో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరూ చెబుతున్నారన్నారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అన్న నినాదంతో ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీలు ఇచ్చి ప్రజలను ఏవిధంగా మోసం చేశారో వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వైనాట్ 175 లక్ష్యంతో ప్రతి ఒక్కరం సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జగనన్న చేసిన మేలు, పేదలు, ప్రజలకు చేసిన మేలును సోషల్ మీడియా ద్వారా ప్రతి ఒక్కరికీ ఏవిధంగా అవగాహన కల్పించాలో వివరించారు. అనంతరం సోషల్ మీడియా మిత్రులకు ఐడీ కార్డ్స్ అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాక్సెంచర్ సంస్థకు ఎంపికైన విద్యార్థులు

పెదకాకాని: ప్రతిష్ఠాత్మక బహుళ జాతీయ సంస్థ, గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ యాక్సెంచర్ నందు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన 176 మంది విద్యార్థులు ఉద్యోగ నియామకాలు పొందారని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నియామకాలు కొరకు ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులు ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న సమయంలో సరైన ప్రణాళిక, మానసిక సంసిద్ధత ద్వారా భారీ సంఖ్యలో వీవీఐటీ విద్యార్థులు నియామకాలు పొందగలిగారని తెలిపారు. 2023 డిసెంబరు 1 నుంచి 15వ తేదీ వరకూ యాక్సెంచర్ సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరచడం ద్వారా ఈ నియామకాలు లభించాయన్నారు. నియామకాలు పొందిన విద్యార్థులకు 6.5 లక్షల నుంచి 4.5 లక్షల రూపాయల వరకూ వార్షిక వేతనాలు సంస్థ కేటాయించినట్లు తెలిపారు. అనంతరం నియామకాలు పొందిన విద్యార్థులను వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు, ఫ్రెష్‌మెన్ డీన్ డాక్టర్ ఎం రఘురామ్, ఉపాధికల్పన, శిక్షణాధికారి డాక్టర్ యు మాధవ్, అధ్యాపకులు అభినందించారు.

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయడం జరిగిందని నగర కమిషనర్ చేకూరి కీర్తి తెలిపారు. ఈ నెల 9న సంపత్ నగర్‌లో బాలికపై వీధి కుక్కల దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కమిషనర్ స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు కుక్కల దాడిలో గాయపడిన బాలికను ఎంహెచ్ఓ మధుసూదన్ పరామర్శించి, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఏటుకూరు రోడ్డులో కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) చేయడానికి ఏజెన్సీని గుర్తించడం జరిగిందని, అగ్రిమెంట్ పూర్తి చేసి, అతి త్వరలో ఏబీసీ ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. జంతు ప్రేమికులు కూడా వీధి కుక్కల విషయంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల తీవ్రతను గమనించి, వీధి కుక్కలకు ఏబీసీ చేయించడంలో నగరపాలక సంస్థకు సహకరించాలని కమిషనర్ కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసుల వివరాల మేరకు.. నల్లచెరువు 23వ లైనుకు చెందిన బొడ్డు మరియన్న (45) పెయింటింగ్ పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై అప్పుల బాధతో గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య చిన్నమ్మాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేడ్-1 సూపరింటెండెంట్‌గా కిరణ్మయికి ఉద్యోగోన్నతి

గుంటూరు మెడికల్: మంగళగిరి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చిలువూరి కిరణ్మయికి గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లకు ఉద్యోగోన్నతి కల్పించారు. కిరణ్మయిని కర్నూలు జిల్లా ఆదోని గవర్నమెంట్ ఆసుపత్రికి బదిలీ చేశారు. సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో 2000 సంవత్సరంలో జీఎన్ఎం పూర్తి చేసి, 2001లో సిద్దిపేట స్టాఫ్‌నర్సుగా విధుల్లో చేరి కిరణ్మయి.. ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించారు. 2007లో హెడ్‌నర్సుగా ప్రమోషన్ పొందారు. 610జీవోలో భాగంగా 2008లో ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రికి బదిలీ అయ్యారు. 2019లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగన్నతి పొంది, మంగళగిరి బదిలీ అయ్యారు. ఆమెకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, పలువురు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు అభినందనలు తెలిపారు.

సంక్రాంతి సంబరాలకు సిద్ధమైన పుట్టలమ్మతల్లి ఆలయం



శ్రీ పుట్టలమ్మతల్లి అమ్మవారు



ఉత్సవాలకు ముస్తాబయిన పుట్టలమ్మతల్లి ఆలయం

గుంటూరు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రతి ఏటా నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామ ప్రజలు నిర్వహించే శ్రీ పుట్టలమ్మతల్లి ఘంటాలమ్మతల్లి ఆలయ సంక్రాంతి ఉత్సవాలు ఈనెల 12వ తేదీనుంచి కన్నుల పండుగగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి గురువారం తెలిపారు. గ్రామంలోని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ ఐదు రోజులపాటు నిర్వహించే ఈ సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ఈనెల 12వ తేదీ శుక్రవారం డబుల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఔట్‌డోర్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నామన్నారు. నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. 13వ తేదీన ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మంత్రులు, తదితరులు హాజరు కానున్నారన్నారు. 13వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో మహిళలకు ప్రత్యేకంగా జిల్లా స్థాయి ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొనే మహిళలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. అమ్మవారి సంక్రాంతి సంబరాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.

సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందివ్వాలి



మాట్లాడుతున్న ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి



డప్పు వాయిద్యాలతో విద్యార్థినుల నృత్యాలు



సాంస్కృతిక ప్రదర్శనలు

- ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి
- మలినేని కళాశాలలో వేడుకగా సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు: సంస్కృతీ సంప్రదాయాలను ఈ తరానికి తెలియజేయడంతో పాటు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పురందేశ్వరి కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించనున్న మహిళా వసతి భవనానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాశ్చాత్య పోకడలతో అంతరించిపోతున్న సంస్కృతీ సంప్రదాయాలకు ప్రాణం పోసేలా, సంక్రాంతి శోభ ఆవిష్కృతమయ్యేలా కళాశాలలో ముందస్తు సంక్రాంతిని జరుపుకోవడం శుభపరిణామమన్నారు.

ఉట్టిపడిన సంక్రాంతి శోభ..

కళాశాలలో విద్యార్థినులు ఏర్పాటు చేసిన భోగి మంటలు, హరిదాసుల నృత్యాలు, కీర్తనలు, కోడి పందేలు, గంగిరెద్దుల విన్యాసాలు, పలు రాష్ట్రాల నృత్య గీతికలు, కోలాటాలు, బొమ్మల కొలువులు, చిలుక జోస్యాలు, సంక్రాంతి శోభ ఉట్టిపడేలా చేశాయి. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ సెక్రటరీ సి.నాగభూషణం, జేఎన్‌టీయూకే పరీక్షా విభాగాధిపతి డాక్టర్ ఎన్. రామకృష్ణయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ జి.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు అపహరించిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

గుంటూరు రూరల్: చెడు వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ రాంబాబు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసరావు అతని భార్య ఈనెల 5వ తేదీన వారి ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వైపుకు వెళుతున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వేగంగా వెళుతూ శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై కూర్చున్న అతని భార్య మెడలోని బంగారు గొలుసును లాక్కుని ద్విచక్రవాహనంపై పరారయ్యాడు.

దీంతో శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సౌత్ జోన్ డీఎస్పీ ఎమ్‌డీ మహబూబ్‌బాషా ఆదేశాలమేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గురువారం పేరేచర్ల సమీపంలో ముద్దాయిని అదుపులోకి తీసుకున్నారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన కాసరబాద శివాజి అలియాస్ శివ చెడు వ్యసనాలకు బానిసై చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. అతని వద్దనుంచి ఒక ద్విచక్రవాహనం, 28 గ్రాముల బంగారు నల్లపూసల గొలుసు సుమారు రూ 1.65 లక్షల విలువ చేసే వస్తువులను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిని అరెస్ట్ చేయటంలో సహకరించిన నల్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్, సిబ్బంది సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, మస్తాన్‌వలిలను ఎస్పీ, డీఎస్పీ అభినందించారు. ముద్దాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కోళ్లకు కట్టే కత్తులు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

గుంటూరు రూరల్: పొలాల్లో ఒంటరిగా తిరుగుతూ కోడిపందేలు నిర్వహించే కత్తులకు పదును పెడుతూ కత్తులు అమ్ముతున్న వ్యక్తిని నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుని వివరాలను సీఐ రాంబాబు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు బైపాస్ సమీపంలోని పొలాల్లో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా అతని వద్ద సుమారు 220 కోడి పందేల కత్తులు దొరికినట్లు తెలిపారు. సంపత్‌నగర్‌కు చెందిన బండి బాలచంద్ర నగర శివారుల్లో కోడి పందేలు నిర్వహించే వారికి కత్తులు విక్రయిస్తుంటాడని పండుగ సమయం కావడంతో కోడి పందేల నిర్వాహకులకు కత్తులు విక్రయించేందుకు అక్కడికి వచ్చినట్లు తెలిపారు. దీంతో ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగించినట్లు తెలిపారు.